www.samasamajam.in

# సమ సమాజం

ప్రశ్నించే అక్షరం... ప్రజలకోసం... తెలుగు దిన పత్రిక

తెలంగాణ | శుక్ర వారం, 25 నవంబర్ 2022 | ఎడిటర్ : గోసుకొండ పృద్విరాజు | సంపుటి - 07, సంచిక-195 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak




## మూడో రోజు కొనసాగిన
# ఐటీ దాడులు

దాడులపై పంచానామ అందించిన ఐటి అధికారులు

28న హాజరు కావాలని మల్లారెడ్డికి నోటీసులు

**హైదరాబాద్, నవంబర్ 24 (సమ సమాజం):** రాష్ట్ర కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డికి చెందిన సంస్థలు, బంధువుల ఇళ్లల్లోనూ మూడో రోజు ఐటీశాఖ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. మంత్రి మల్లారెడ్డికి చెందిన సంస్థలు, బంధువుల ఇళ్లల్లో ఐటీశాఖ అధికారుల సోదాలు ముగిశాయి. కుత్బుల్లాపూర్ లోని మల్లారెడ్డి బంధువుల ఇంట్లో సోదాలు పూర్తయ్యాయి. దూలపల్లిలోని ప్రవీణ్ రెడ్డి, సుచిత్రలోని త్రిశూల్ రెడ్డి 3లో

# ఐటీ దాడులు జరుగుతన్న తీరు దారుణం



- మంత్రి మల్లారెడ్డి ఇళ్లపై ఐటీ సోదాల్లో మరో ట్విస్ట్
- రెండు నెలలుగా మంత్రి లావాదేవీలపై నిఘా
- ఆధారాలు సేకరించాకే.. వ్యూహాత్మకంగా దాడులు

- బిజేపీ కుట్రలకు భయపడేది లేదు
- దాడులకు భయపడొద్దని సీఎం కేసీఆర్ ముందే చెప్పారు
- తాము చేసేది వ్యాపారం కాదు..విద్యారంగంలో సేవ
- అధికారంలోకి వచ్చేది బిఆర్ఎస్..ఎవ్వరినీ వదలబోం
- మీడియాతో మంత్రిమల్లారెడ్డి వ్యాఖ్యలు

**హైదరాబాద్, నవంబర్ 24 (సమ సమాజం):** ఐటి దాడులు ఇంతటితో ముగియలేదని, ఇతరటిఆర్ఎస్ నేతలపైనా దాడులు జరిగే ప్రమాదం ఉందని ఐటీ దాడులపై మంత్రి మల్లారెడ్డి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది పార్ట్ -1 మాత్రమే అని పార్ట్-2, పార్ట్-3 కూడా ఉంటుందని అన్నారు. అయితే వీటికి భయపడేది లేదని, తాము 3లో

# వ్యవస్థలను ధ్వంసం చేస్తున్న ప్రధాని మోడీ



మధ్య ప్రదేశ్‌లో అక్రమంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చారు

జోడోయాత్రలో ఘాటు విమర్శలు చేసిన రాహుల్

మధ్య ప్రదేశ్‌లో సోదరుడితో కలసి అడుగులు వేసిన ప్రియాంక

**భోపాల్, నవంబర్ 24 (సమ సమాజం):** మోడీ ప్రభుత్వంలో ప్రజాస్వామ్య మార్గాలన్నీ మూసుకుపోయాయని.. అందుకోసమే తాను భారత్ జోడో యాత్రను చేపట్టినట్లు కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ తెలిపారు. లోక్‌సభ, ఎన్నికల వ్యవస్థ, మీడియా అన్నీ మూతపడ్డాయని.. అన్ని సంస్థలు ఆర్ఎస్ఎస్, బిజెపి మనుషులతో నిండిపోయాయని మండిపడ్డారు. న్యాయవ్యవస్థ కూడా ఒత్తిడికి లోనవుతోందని ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ చేపట్టినన్న భారత్ జోడో యాత్ర ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లో కొనసాగుతుంది. గురువారం ఆయన సోదరి ప్రియాంక గాంధీ వాద్రా కూడా యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. అడుగులు ఇప్పుడు బలంగా ఉంటాయని అన్నారు. మధ్యప్రదేశ్ ఎన్నికల్లో తాము గెలిచినప్పటికీ ..బిజెపి కుటు÷-ర పూరితంగా తమ ప్రభుత్వాన్ని కూల్చిందన్నారు. దేశంలో ప్రస్తుతం ఇదే తంతు నడుస్తోందన్నారు. ఆపరేషన్ కమలం పేరిట బిజెపి 20-25 ఎమ్మెల్యేలను కోట్లకు కోట్లు చెల్లించి తమ ప్రభుత్వాన్ని కూల్చివేసిందని మండిపడ్డారు. భారత్‌లో వ్యాప్తి చెందుతున్న హింస, విద్వేషం, భయాలను అడ్డుకోవడం ఈ యాత్ర మొదటి లక్ష్యమని అన్నారు. సెప్టెంబర్ ఏడున ప్రారంభమైన ఈ యాత్ర మహారాష్ట్రలో పూర్తి చేసుకుని బుధవారం బిజెపి పాలిత ప్రాంతం మధ్యప్రదేశ్‌లోకి ప్రవేశించింది. ఖాండ్వాలోని బోర్గావ్ 3లో

# ఈడబ్ల్యూఎస్ కోటాలో ఎస్సీ, ఎస్టీలకు చోటు

26 నుంచి బిసి రిజర్వేషన్లపై ఉద్యమిస్తాం

బిఎస్పీ అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వెల్లడి



**హైదరాబాద్, నవంబర్ 24 (సమ సమాజం):** ఈడబ్ల్యూఎస్ కోటాలో ఆర్థికంగా వెనకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అవకాశం ఇవ్వాలని, కేంద్రం బీసీ జనగణన చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై నవంబర్ 26 నుంచి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ప్రవీణ్ కుమార్ తెలిపారు. కోటి సంతకాల సేకరణ చేసి రాష్ట్రపతికి పంపుతామన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పెరిగిన జనాభాకు 3లో

# సిఎం కెసిఆర్ మానస పుత్రిక డబుల్ ఇళ్ల పథకం



పేదల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఇళ్ల నిర్మాణం

త్వరితగతిన ఇల్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్న మంత్రి

**హైదరాబాద్, నవంబర్ 24 (సమ సమాజం):** డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణ పథకం సీఎం కేసీఆర్ మానస పుత్రిక అని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఈ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్నదని చెప్పారు. పేదలు గౌరవంగా బతకాలన్న లక్ష్యంతో సిఎం కెసిఆర్ ఈ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఇప్పటికే వేల ఇళ్లల్లో పేదలు ప్రశాంతంగా జీవిస్తున్నారని అన్నారు. వందశాతం సబ్సిడీతో పేదలకు ఇండ్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని చెప్పారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణ పనుల 3లో

# రాష్ట్రంలో మళ్లీ మొదటికి వచ్చిన వీఆర్ఏల సమస్య


ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో అయోమయం

కెటిఆర్‌తో చర్చలు జరిగినా ఫలితం శూన్యం

**హైదరాబాద్, నవంబర్ 24 (సమ సమాజం):** రాష్ట్రంలో వీఆర్ఏల సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో వీఆర్ఏల పరిస్థితి అయోమయంగా మారింది. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో వీఆర్ఏల డిమాండ్లు పరిష్కారం చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. వీఆర్ఏ ప్రతినిధులతో జరిగిన చర్చల సందర్భంగా ఉపఎన్నిక ముగిసిన తెల్లారి డిమాండ్ లు పరిష్కారం చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఇప్పటి వరకు కనీసం వారిని పిలవలేదు. దీంతో ఏమి చేయాలో అర్థం కాక.. ఎవరిని కలవాలో అర్థం కాక వీఆర్ఏలు ఆగమాగం అవుతున్నారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ దాదాపు 83 రోజులకు పైగా వీఆర్ఏలు 3లో

# నేడు బిజెపిలో చేరనున్న మర్రి శశిధర్ రెడ్డి

ఢిల్లీకి వెళ్లిన బిజెపి ప్రముఖులు



**హైదరాబాద్, నవంబర్ 24 (సమ సమాజం):** ఇటీవలే కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మాజీ సిఎం మర్రి చెన్నారెడ్డి తనయుడు, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి శుక్రవారం బిజెపిలో చేరనున్నారు. ఈ మేరకు బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్, పార్టీ నేతలు డీకే అరుణ, వివేక్ వెంకటస్వామి, ఈటల రాజేందర్, మరి కొందరు సీనియర్ నేతలు గురువారం ఢిల్లీకి వెళ్లారు. 25న కాంగ్రెస్ నేత మర్రి శశిధర్ రెడ్డి ఢిల్లీలో బీజేపీ జాతీయ నేతల సమక్షంలో ఆ పార్టీ చేరనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర ముఖ్య నేతలు ఢిల్లీకి వెళు న్నారు. బీఎల్ సంతోష్ కు సిట్ నోటీసు ఇచ్చిన అంశం, రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులపై కూడా ఢిల్లీ పెద్దలను కలిసి రాష్ట్ర నేతలు వివరించే చాన్స్ ఉంది.ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి బీజేపీ శిక్షణా తరగతులు, రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను జాతీయ నేతలకు వివరించనున్నారు. ఇతర పార్టీల నేతల 3లో

# ఇసిగా అరుణ్ గోయల్ నియామకంలో అత్యుత్సాహం

ఒక్కరోజులోనే ప్రక్రియ మొత్తం ఎలా పూర్తి చేస్తారు

విఆర్ఎస్ తీసుకున్న వ్యక్తికి పదవి కట్టబెట్టడంలో ఆంతర్యం


నియామక ప్రక్రియలో కేంద్రం తీరుపై సుప్రీం ఆగ్రహం



**న్యూఢిల్లీ, నవంబర్ 24 (సమ సమాజం):** ఎన్నికల కమిషనర్ల నియామకంలో కేంద్రం చూపిన వేగాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఒక్క రోజులోనే మొత్తం పక్రియ ఎలా పూర్తి చేశారని సుప్రీంకోర్టు నిలదీసింది. నియామకాలపై గురువారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈసీ అరుణ్ గోయల్ నియామకానికి సంబంధించిన ఫైళ్లను.. సుప్రీంకోర్టుకు అటార్నీ జనరల్ సమర్పించారు. మే 15 నుంచి కేంద్ర ఎన్నికల కమిషనర్ పోస్టు ఖాళీగా ఉంది. మే 15 3లో

# గ్రూపు పరీక్షల్లో మరికొన్ని పోస్టులు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం




**హైదరాబాద్, నవంబర్ 24 (సమ సమాజం):** ప్రభుత్వం నిరుద్యోగులకు తీపికబురును అందించింది. ఇటీవల గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలు పూర్తి కాగా.. త్వరలో గ్రూప్-,2 3, 4 పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ జారీ చేయనున్నది. వాటిలో ఉన్న పోస్టులకు తోడు మరికొన్ని పోస్టులు చేరుస్తోంది. గ్రూప్-2లో కొత్తగా ఆరు రకాల పోస్టులు చేర్చగా, గ్రూప్-3 రెండు రకాల పోస్టులు, గ్రూప్-4లో నాలుగు రకాల పోస్టులు చేర్చినట్లు ప్రభుత్వం ఉత్తర్వులు తెలిపింది. ఈ 3లో

# అటవీ అధికారి హత్యకు బాధ్యత ప్రభుత్వానిదే

బీజేపీ తెలంగాణ అధ్యక్ష్యుడు బండి సంజయ్



**రాజన్న సిరిసిల్ల, నవంబర్ 24 (సమ సమాజం):** ఫారెస్ట్ అధికారి శ్రీనివాసరావు హత్యకు కేసీఆర్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీజేపీ తెలంగాణ 3లో

# ధరణితో రైతులకు మోసం: కాంగ్రెస్



**హైదరాబాద్, నవంబర్ 24 (సమ సమాజం):** రైతుల సంక్షేమాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కాంగ్రెస్ నేత దేప భాస్కర్ రెడ్డి మండిపడ్డారు. ఎవరి లబ్ది కొరకు సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ తీసుకొచ్చారని ప్రశ్నించారు. త్వరలోనే సీఎం కేసీఆర్‌కు రైతులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ధరణి పోర్టల్ తెచ్చి పేదల భూములను దొరల పాలు చేశారని భాస్కర్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో రాక్షస పాలన కొనసాగుతోందని విమర్శించారు. ధరణి పోర్టల్ రైతులకు శాపంగా మారిందని ఆరోపించారు. దీనివల్ల బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం జరుగుతోందన్నారు. రేవంత్ రెడ్డి పిలుపు మేరకు అన్ని మండల కేంద్రాల్లో కాంగ్రెస్ నేతలు నిరసన తెలుపుతున్నారు.

# డిసెంబర్‌లో వారం పాటు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు

తెలంగాణ ఆర్థిక ప్రగతికి కేంద్రం అడ్డుపుల్లలు ● రాష్ట్ర ఆదాయంలో రూ.40వేలకోట్లకు గండి ● అసెంబ్లీ సమావేశాల్లో ఎండగట్టాలని కెసిఆర్ నిర్ణయం



**హైదరాబాద్, నవంబర్ 24 (సమ సమాజం):** డిసెంబర్ నెలలో వారం రోజుల పాటు శాసనసభ సమావేశాలు నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఇందులో ప్రధానంగా కేంద్రం అనుసరిస్తున్న తీరుతో రాష్ట్రం ఏ విధంగా నష్టపోతుందో చర్చిస్తారు. ప్రధానంగా ఆర్థికంగా కేంద్రం చర్యలను ప్రజలకు తెలిసేలా చర్చిస్తారు. అభ్యుదయ పథంలో నడుస్తున్న తెలంగాణ రాష్ట్రంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విధిస్తున్న అనవసరపు ఆంక్షలు విధిస్తోందని సీఎం కేసీఆర్ ఆరోపించారు. దీనివల్ల 2022 -23 ఆర్థిక సంవత్సరానికి గానూ రాష్ట్రానికి సమకూరాల్సిన ఆదాయంలో రూ.40 వేల కోట్ల రూపాయలకు పైగా తగ్గుదల చోటు చేసుకుందని చెప్పారు. ఇటువంటి చర్యల ద్వారా తెలంగాణ అభివృద్ధి ముందుకు సాగకుండా కేంద్రం అడ్డుకట్ట వేస్తోందన్నారు. ఇప్పటికే జిఎస్టీ బకాయిలు సరిగా అందించడం లేదు. అలాగే అనేకానేక అంశాల్లో రాష్ట్ర వాటాలను చెల్లించడం లేదు. జిఎస్టీ వసూళ్లు సజావుగా సాగుతున్నా రాష్ట్రవాటా మాత్రం జమకావడం లేదు. ఇకపోతే విభజన సమస్యలపైనా 8 ఏళ్లుగా నాన్చుతున్నారు. తెలంగాణపై ప్రధాని మోదీ సర్కార్ వైఖరిపై 3లో

## సంపాదకీయం

# పటిష్ట ఎన్నికల కమిషన్ అత్యావశ్యం !

ఎన్నికల కమిషన్ అనేది మన ప్రజాస్వామ్యానికి మూలస్తంభం లాంటి. అది పకడ్బందీగా ఎన్నికలను నిర్వహిస్తూ ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మగా ఉండాలి. అది నిర్వీర్యం అయితే అధికారంలో ఉన్న పార్టీలు స్వారీ చేస్తాయి. ఎన్నికల సంఘం ఎంత నిజాయితీగా, నిర్భీతిగా, నిరంకుశంగా పనిచేస్తే మన వ్యవస్థ అంత పటిష్ఠంగా ఉండగలుగుతుంది. రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడు ఒకలా..లేనప్పుడు మరోలా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్‌ను జేబు సంస్థగా మార్చుకుంటున్న తీరుతో ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతోంది. ప్రస్తుతం మనదేశంలో ఎన్నికల వ్యవస్థ మేడిపండు చందంలా తయారయ్యింది. ఎన్నికల నిర్వహణ అన్నది ఓ ఫార్సులా తయారయ్యింది. డబ్బులు విచ్చలవిడిగా వెదజల్లుతూ ఎన్నికల్లో గెలవ గలుగుతున్నారు. సామాన్యులు, మేధావులు, సమాజంలో పేరు ప్రతిష్టలు ఉన్న వారు ప్రజా ప్రతినిధులుగా గెలవడం సాధ్యం కావడంలేదు. రౌడీలు,గూండాలు,హంతకులు డబ్బులు వెదజల్లుతూ.. ఓట్లను కొనుగోలు చేస్తూ గెలుస్తున్నారు. దీంతో నిరంకుశ ప్రభుత్వం ఏర్పడి..ఈసంస్థ స్వేచ్ఛను,సమగ్రతను దెబ్బతీస్తున్నా యి. తాజాగా సుప్రీం ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు లేదా సూచనలు లేదా ఆదేశాలు కావచ్చు.. ఎన్నికల కమిషన్‌లో సంస్కరణలు తీసుకు రావాల్సిన సమయం ఆసన్నమైంది. ముందుగా, ఎన్నికల కమిషనర్ల ఎంపిక ఒక కమిటీ ద్వారా జరగాలి. ఆ కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత సభ్యులుగా వుండాలి. ఇప్పుడు కమిషనర్ల ఎంపిక పూర్తిగా ప్రభుత్వం చేతుల్లోనే వుంటోంది. ఇక రెండోది, పదవీ విరమణ చేసిన తర్వాత, కమిషనర్ ఎలాంటి అధికారిక పదవిని చేపట్టరాదన్న నిబంధన కూడా ఉండాలి. గతంలో శేషన్ ఒక్కడే ఒంటిచేత్తో ఎన్నికల సంఘాన్ని నడిపారు. ఎన్నికల వ్యవస్థలో మార్పులకు శ్రీకారం చుట్టారు. ఉన్న చట్టాలతోనే ఆయన తన నిజాయితీతో ముందుకు సాగారు. ఇటీవల కాలంలో భారత ఎన్నికల కమిషన్ తీసుకున్న కొన్ని చర్యలు, అనుసరించిన వైఖరులు...వివాదాస్పదం అయ్యాయి. స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికలు నిర్వహించే పర్యవేక్షణ కొరవడింది. నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదు.గత కొన్నేళ్ళుగా, ముఖ్యంగా మోడీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగానే ఎన్నికల సంఘం వ్యవహరించడం కనిపిస్తోందన్న విమర్శలు బలపడ్డాయి. ఈ క్రమంలో సుప్రీంకోర్టు తాజాగా చేసిన వ్యాఖ్యలను అనుసరించి ఎన్నికల సంఘాన్ని మరింత బలోపేతం చేయాలి. స్వతంత్రంగా నడిచే సంస్థలా చేయాలి. ఎవరు కూడా వేలు పెట్టరాకుండా చేయాలి. తప్పుచేస్తే ప్రధాన మంత్రిపై సైతం చర్యలు తీసుకునేంత సత్తా ఉన్న ప్రధాన ఎన్నికల కమిషనర్ దేశానికి అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తుల ఎంపిక అవసరమని కూడా పేర్కొంది. కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ల నియామకానికి ప్రస్తుతం నడుస్తున్న వ్యవస్థ సరికాదని, కొలీజియం లాంటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై బుధవారం జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ అజరు రస్తోగి, జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ హృషికేశ్ రారు, జస్టిస్ సిటి రవికుమార్‌లతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారించింది. ఎన్నికల సంఘం విధుల పైనా ధర్మాసనం లోతుగగానే చర్చించింది. ప్రధానికి వ్యతిరేకంగా ఆరోపణలు వచ్చాయనుకుందాం. సిఇసి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. సిఇసి బలహీనంగా ఉంటే ఎలాంటి చర్యలు తీసుకోలేరు కదా అని ధర్మాసనం పేర్కొంది. సిఇసి ఉన్నత స్థానం రాజకీయ ప్రభావానికి లోనుకాకుండా ఉండాలని కూడా అభిప్రాయపడింది. అంటే స్వతంత్రంగా ఉండాలి. కానీ అలా జరగడం లేదు. అందువల్ల ఇది పూర్తిగా వ్యవస్థ విచ్ఛిన్నం కిందకే వస్తుందని కూడా అభిప్రాయపడింది. ఎన్నికల కమిషనర్ నియామకంలో

అనుసరిస్తున్న యంత్రాంగాన్ని తమకు చూపాలని కోరింది. కేంద్ర మంత్రివర్గం సలహా మేరకు ఎన్నికల కమిషనర్లను రాష్ట్రపతి నియమించాలని రాజ్యాంగంలో ఉందని, ఇంతవరకు అదే అమలవుతోందని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి తెలిపారు. జస్టిస్ అజరు రస్తోగి జోక్యం చేసుకొని ఇసి నియామకంలో ప్రజలు ప్రశ్నించకుండా ఉండేలా పారదర్శకమైన యంత్రాంగం ఉండాలని అన్నారు. రిటైర్డ్ సివిల్ సర్వెంట్ అరుణ్ గోయల్‌ను ఎన్నికల కమిషనర్‌గా ఇటీవల నియమించిన ఫైల్‌ను సమర్పించాలని ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.ఇప్పుడున్న రోజుల్లో కేంద్రంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నా.. ఆ అధికారాన్ని శాశ్వతంగా నిలబెట్టుకోవాలనుకుంటోందని, పార్టీలతో సంబంధం లేకుండా ప్రతి ప్రభుత్వం కూడా అన్ని విషయాల్లో తమకు 'యస్' అంటూ తలూపే వ్యక్తినే సిఇసిగా నియమిస్తోందని ధర్మాసనం పేర్కొంది. అప్పుడు అది స్వతంత్ర సంస్థ ఎలా అవుతుందని కేంద్రాన్ని ప్రశ్నించింది. కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి నియామకం కోసం సమ్మిళిత ప్రక్రియ అవసరం. ఈ నియామకం కోసం ఏర్పాటు చేసే కమిటీలో సిజెఐను కూడా సభ్యుడిగా చేర్చాలని ధర్మాసనం అభిప్రాయపడింది.ఎన్నికల కమిషన్‌లో సంస్కరణలు తీసుకు రావాల్సిన సమయం ఆసన్నమైంది. ముందుగా, ఎన్నికల కమిషనర్ల ఎంపిక ఒక కమిటీ ద్వారా జరగాలి. ఆ కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత సభ్యులుగా వుండాలి. ఇప్పుడు ఇ.సి కమిషనర్ల ఎంపిక పూర్తిగా ప్రభుత్వం చేతుల్లోనే వుంటోంది. ఇక రెండోది, పదవీ విరమణ చేసిన తర్వాత, కమిషనర్ ఎలాంటి అధికారిక పదవిని చేపట్టరాదు. పార్లమెంటుకు లేదా అసెంబ్లీకి సభ్యులుగా వీరిని రాజకీయ పార్టీలు నామినేట్ చేయరాదు. ఇలా కఠిన నిబంధనలతో జవాబుదారీగా ఉండే విధంగా కమిషనర్లను ఎంపికచేయాలి. ఇటీవలి మునుగోడు ఉప ఎన్నికనే తీసుకుంటే అక్కడ అధికార దుర్విని గం అయ్యింది. మద్యం ఏరులై పారింది. డబ్బులు విచ్చలవిడిగా వెదజల్లారు. కోట్లు ఖర్చు పెట్టి ఎన్నికల్లో గెలవడానికి ప్రయత్నించారు. ఇలాంటి చర్యలను అడ్డుకోగలిగేలా చూడాలి. పోలీస్ యంత్రాంగం మొత్త ఇసి పరిధిలో పనిచేయగలగాలి. అలాగే డబ్బులను పట్టుకున్న సందర్భంలో పోలీసులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇలా ఒకటేమిటి సర్వం అవినీతిమయంగా ఎన్నికల ప్రక్రియ సాగుతున్న వేళ సంస్కర ణలు అవసరమే. అవన్నీ కూడా ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్టం చేసేవిగా, ఎన్నికల సంఘం బలంగా నిష్పక్షపాతంగా, అధికార పార్టీ ఆదేశాలకు దూరంగా ఉండేలా రూపొందించుకోవాల్సి ఉంది.

**పృధ్విరాజ్ గోసుకొండ**
ఎడిటర్

# ఉచితపథకాలపై సమగ్ర చర్చ జరగాలి

**ఇసి పరిధిలోనే ఎన్నికల విధానాలు ఉండాలి**

**అక్రమార్కులపై కొరడా ఝుళిపించే అధికారం రావాలి**

**ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు పటిష్టంగా జరగాలి**

న్యూఢిల్లీ, నవంబర్ 24 (సమ సమాజం): రాజకీయ పార్టీల ఉచితహామీలపై గతంలోనే సుప్రంలో చర్చ జరిగింది. ఇది ఇసి పరిధిలోనే ఉండాలి. ఉచిత హామీలను ఇవ్వకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్ పరిధిలో ఉండాలి. ఒకవేళ ఉచిత పథకాలు ప్రకటిస్తే దానికి ఆర్థికంగా అమలుకు ఉండే అవకాశాలను ప్రతిపాదించాలి. ఇటీవల రాజకయా పార్టీలు ఈ దురదృష్టకరమైన ధోరణిని ప్రముఖంగా ప్రస్తావిస్తున్నాయి. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు ఉచితాలు ఇస్తామంటూ చేసే హామీలు, వాగ్దానాలనేవి తమ పరిధిలోకి రావంటూ ఇ.సి సుప్రీం కోర్టులో గతంలో తన వైఖరి స్పష్టం చేసింది. ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి చేసే ఏ ప్రయత్నమైనా కూడా తమ అధికారాలను ఉల్లంఘించి వ్యవహరించడమే అవుతుందని పేర్కొంది. ఎన్నికల నిబంధనావళిని సవరించాలని ఆలోచిస్తున్నామని, రాజకీయ పార్టీలు చేసే ఎన్నికల వాగ్దానాలు, వాటి ఆర్థిక పర్యవసానాల వివరాలను వెల్లడించే ప్రొఫార్మాను ప్రవేశ పెట్టాలను కుంటున్నామంటూ రాజకీయ పార్టీలకు ఇ.సి అక్టోబర్‌లో తెలియచేసింది. పైగా, రాజకీయ పార్టీలు తాము ఇచ్చే హామీలను నెరవేర్చేందుకు అవసరమయ్యే అదనపు వనరులను ఎలా సమీకరిస్తారో కూడా తెలియ చేయాల్సి వుంటుందని పేర్కొంది. ఈ రీతిలో ప్రజలకు రాజకీయపార్టీలు ఇచ్చే హామీల విషయంలో జోక్యం చేసుకోవడమనేది...విజ్ఞతతో కూడి ఉండాలి. ఆర్థికసుస్థిరత అన్నది రాజకీయ పార్టీ విధానాన్ని నియంత్రించే ప్రయత్నమే. ఇటువంటి ఎన్నికల వాగ్దానాలను సమీక్షించాల్సిన పని ఇ.సి కి లేదు. కానీ, ఇటువంటి చర్య తీసుకోవడం ద్వారా, కొద్ది మాసాల క్రితం సుప్రీం కోర్టులో తాను తీసుకున్న వైఖరికి పూర్తి భిన్నంగా, ప్రధాని ఆదేశాలను నెరవేరుస్తున్నారన్న ఆరోపణలను మూటగట్టుకునే రీతిలో ఇ.సి వ్యవహరించింది. ప్రభుత్వం మొదటిసారిగా ప్రతిపాదించిన ఎన్నికల బాండ్ల పథకానికి వ్యతిరేకంగా ఇ.సి నిర్ద్వంద్వంగా తన వైఖరిని తెలియచేసింది. ఎలాంటి పారదర్శకత లేని ఈ వ్యవస్థ గురించి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ, ఇటువంటి అజ్ఞాత నిధులు, విరాళాలు స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికల నిర్వహణను ఎలా దెబ్బతీస్తాయో తెలియచేసింది. ఇకపోతే ఎన్నికల్లోకి అజ్ఞాతంగా వచ్చిపడే నిధుల ప్రవాహాన్ని ఎలా అడ్డుకోవాలనేది తీవ్రంగా ఆలోచించాలి. రాజకీయ పార్టీలు అందుకునే విరాళాలను బహిర్గతం చేయాలి. రూ.20 వేలకు పై బడిన విరాళాలకు రాజకీయ పార్టీలు మూలం ప్రకటించాలని చట్టం పేర్కొంటోంది. అయితే, రూ.2 వేలకు పైబడిన విరాళాలు వచ్చినా వాటిని కూడా ప్రకటించేలా ఈ చట్టాన్ని సవరించాలని సెప్టెంబర్‌లో న్యాయ శాఖ మంత్రికి ఇ.సి లేఖ రాసింది. రూ.2 వేల కన్నా తక్కువ మొత్తంలో అజ్ఞాతంగా వచ్చిన విరాళాలపైనా ఆంక్షలు విధించాలని ఇ.సి భావిస్తోంది. పాలక పార్టీకి విధేయంగా వుండడానికి సదా సన్నద్ధంగా వుండే కార్పొరేట్లు, చీకటి వ్యాపారుల నుండి పెద్ద మొత్తంలో నిధులు సమీకరించడమన్నది ఆగిపోవాలి. అలాగే ఇవిఎంలపై ఉన్న అనుమానాలు తొలగి పోవాలి. ఇవిఎంలలో వేసిన ఓటు, వివిప్యాట్లకు సరిపోతుందా లేదా అన్నది తెలుసుకునే హక్కు ప్రజలకు ఉంది. ఓటేసిన వారికి ఆ హక్కు ఉంది. కానీ ఎన్నికల సంఘం కూడా దీనికి అంగీకరించే స్థితిలో లేదు. ఇకపోతే గతంలో ఎన్నడూ లేనంతగా ఎన్నికల సంఘం అభాసుపాలవు తోంది. ఇవిఎంలు మొరాయించడం మొదలు, ఓటింగ్ శాతంలలో తేడాలు రావడ, వేసిన ఓట్లకన్నా కౌంటింగ్‌లో ఎక్కువ లెక్కకు రావడం వంటి అంశాలు ఇసి నిజాయితీని శంకించేలా చేస్తున్నాయి. వీవీప్యాట్ల లెక్కింపుపై ఇంతవరకు మార్గదర్శకాలు జారీ చేయలేదు. నిజానికి దేశంలోని చట్టసభలకు ఎన్నికలను స్వేచ్ఛగా, న్యాయంగా నిర్వహించేందుకు రాజ్యాంగం ద్వారా అధికారం పొందిన ఎన్నికల సంఘం నిష్పక్ష పాతంగా వ్యవహరించాలి. కొన్ని లోపాలు, లొసుగులు వున్నప్పటికీ ఎన్నికలను స్వేచ్ఛగా, న్యాయంగా నిర్వహించటంలో ఎన్నికల కమిషన్ విశ్వసనీయతను నిరూపించుకోవాలి. ఎన్నికల్లో ధన బలం వినియో గాన్ని నివారించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి సక్రమంగా అమల య్యేలా చూడాల్సిన కమిషన్ తన కర్తవ్య నిర్వహణలో విఫలం కావడం క్షంతవ్యం కాదు. ఇకపోతే గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో పోలైన ఓట్లకు లెక్కించిన ఓట్లకు మధ్య తేడా వచ్చింది. అలాగే దాదాపు 25 లక్షల వరకు ఓట్లు గల్లంతు అయినట్లుగా ఆరోపణలు వచ్చాయి. మొత్తంగా ఇలాంటి అక్రమాలు అవకతవకలు బయట పడుతున్నాయి. ఎన్నికల కమిషన్‌ను పూర్తి స్థాయిలో సంస్కరించి దాని సమగ్రతను కాపాడేందుకు, కేంద్ర ప్రభుత్వం, అధికార పార్టీ ప్రభావం పడకుండా రక్షించుకునేందుకు చర్యలు తీసుకోవడం అవసరం. ఎన్నికల కమిషనర్లను కేంద్ర ప్రభుత్వమే నియమించే ప్రస్తుత విధానం మారాలి. ఈ విధానానికి బదులుగా ప్రధాని, ప్రతిపక్ష నేత, ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ సూచనల మేరకు రాష్ట్రపతి ఎన్నికల కమిషనర్లను నియమించే విధానం అమలు లోకి రావాల్సిన అవసరం వుంది. దీనితో పాటు పదవీ విరమణ చేసిన ఎన్నికల కమిషనర్లు తరువాత ప్రభుత్వ పదవుల్లో అంటే గవర్నర్లుగానో, చట్టసభల సభ్యులుగానో నియమితులు కావటాన్ని కూడా నిషేధించాలి. ఇసి నిష్పక్షపాతంగా వ్యవహరించే విధంగా చట్టాన్ని మరింత పారదర్శకంగా రూపొందించుకోవాలి. ఆరోపణలపై తక్షణం ఇసి స్పందించి నిర్ణయాలు తీసుకోవాలి. కానీ అలా జరగడం లేదు. అనుమానాలు నివృత్తి చేయడం లేదు. ఓటరు కార్డు ఉన్నా ఓట్లు గల్లంతు అవుతున్న పట్టింపు లేకుండా పోయింది. ఇలా ఉత్పన్నమైన సమస్యలకు అనుమానా లకు ఇసి వద్ద సమాధానం లేదు. వీటికి సమాధానం చెప్పగలిగేలా ఇసి జవాబుదారీగా ఉండేలా చట్టాలు రూపొందించాలి. అధికార పార్టీకి కొమ్ముకాసే విధానాలు పోవాలి. అప్పుడే భారత ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. ప్రజలు కూడా స్వేచ్ఛగా తాము కోరుకున్న పార్టీకే ఓటేసామనే నమ్మకాన్ని పొందుతారు.

## ఉద్దేశ్యపూర్వకంగానే ఐటి దాడులు

**ఢిల్లీ పెద్దల ఆదేశాలతోనే ఈ సోదాలు**

**దాడులను ఖండించిన అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డి**



హైదరాబాద్,నవంబర్24(సమ సమాజం): ఢిల్లీ పెద్దల ఆదేశాలతోనే తమపై ఐటీ దాడులు జరుగుతున్నాయని మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఐటీ దాడులు ఉద్దేశపూర్వకంగా చేస్తున్నవేనని అన్నారు. తమ ఇళ్లు, ఆఫీసులు, విద్యా సంస్థలపై ఐటీ దాడులను ఆయన ఖండించారు. ఐటీ సోదాల్లో నాలుగు కోట్లు దొరకడం పెద్ద విషయం కాదన్నారు. తన ఆధ్వర్యంలో 5 విద్యాసంస్థలు నడుస్తున్నాయని చెప్పారు. ఒక్కో విద్యాసంస్థలో సిబ్బందికి ఇచ్చే వేతనాల ఖర్చే రూ.2 కోట్లు ఉంటుందన్నారు. ఐదు విద్యాసంస్థల్లో ప్రతి నెలా రూ.10 కోట్లు జీతాలే చెల్లిస్తామని చెప్పారు. అలాంటిది 4 కోట్లు దొరకడం పెద్ద విషయం కాదన్నారు. తనది సాధారణమైన ఇల్లని, తన ఇంట్లో డిజిటల్ లాకర్లు ఎందుకు ఉంటాయని ప్రశ్నించారు. తమ కుటుంబం పార్టీ మారాలనే ఈ దాడులు చేస్తున్నారని మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోదాల సందర్భంగా ఐటీ అధికారులు తమ కుటుంబ సభ్యుల పట్ల అమానుషంగా ప్రవర్తించారని ఆరోపించారు. 75 ఏళ్లు పైబడిన తన తండ్రిని పగలూ రాత్రీ అనే తేడాలేకుండా ఇంటికి బయటకూ తిప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కూతురి పట్ల అధికారులు ప్రవర్తించిన తీరు చూసి తనకు బాధగా ఉందన్నారు. తన కూతురు,తండ్రి పట్ల ఐటీ అధికారుల తీరుపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. ఐటీ అధికారులు సోదాలకు వచ్చినపుడు తాను టర్కీలో ఉన్నానని మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. తన కుటుంబ సభ్యులు, విద్యాసంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగుల ఫోన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. ఐటీ దాడుల విషయం తనకెవరూ చెప్పలేదని.. మీడియాలో చూసే తెలుసుకున్నానని అన్నారు

## ఐటి అధికారులు, మల్లారెడ్డిల పరస్పర కేసులు

**తన ల్యాప్‌టాప్‌ను ఎత్తుకెళ్లారన్న ఐటి అధికారి**

హైదరాబాద్,నవంబర్24(సమ సమాజం): ఐటీ సోదాల్లో మిస్సైన ల్యాప్ టాప్ ఇష్యూ కీలకంగా మారుతోంది. ఆ ల్యాప్ టాప్ ఐటీ డిప్యూటీ డైరెక్టర్ రత్నాకర్ కు చెందినదిగా గుర్తించారు. అర్ధరాత్రి సోదాల సమయంలో ఐటీ ఆఫీసర్ రత్నాకర్ దగ్గర నుంచి మల్లారెడ్డి అనుచరులు ల్యాప్ టాప్ లాక్కెళ్లారు. ఇదే విషయంపై బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ లో ఐటీ అధికారి రత్నాకర్.. మంత్రి మల్లారెడ్డిపై ఫిర్యాదు చేశారు. పీఎస్ లో ఫిర్యాదు చేశాక... కొద్దిసేపటికి ఇద్దరు వ్యక్తులు బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ దగ్గరకు వచ్చి ల్యాప్ టాప్ ను గేటు దగ్గర పెట్టే ప్రయత్నం చేశారు. ఆ ఇద్దర్ని ఐటీ ఆఫీసర్లు, సీఆర్పీఎఫ్ అధికారులు ప్రశ్నించారు. పోలీస్ స్టేషన్ లో ఉన్న ల్యాప్ టాప్ తీసుకెళ్లాలని ఐటీ అధికారులను పోలీసులు కోరారు. అయితే తన ల్యాప్ టాప్ లో ఐటీ దాడులకు సంబంధించి ముఖ్యమైన సమాచారం డిటైల్స్ ఉన్నాయని ఐటీ అధికారి రత్నాకర్ అంటున్నారు. పోలీస్ స్టేషన్ లో ఉన్న ల్యాప్ టాప్ తనది కాదని చెబుతున్నారు. దీంతో ఆ ల్యాప్ టాప్ ను పంపాలని పోలీసులు భావిస్తున్నారు. అయితే అధికారులు ల్యాప్ టాప్ మర్చిపోతే.. తామే పోలీస్ స్టేషన్ లో ఇచ్చి వచ్చామని చెబుతున్నారు మంత్రి మల్లారెడ్డి. తాత్రి నడిచిన హైడ్రామాలో ఐటీ అధికారులపై మంత్రి మల్లారెడ్డి కేసులు పెడితే.. ఐటీ అధికారులు కూడా మంత్రి మల్లారెడ్డిపై కేసులు పెట్టారు. బోయిన్ పల్లి పీఎస్ లో నమోదైన ఈ కేసులను దుండిగల్ కు ట్రాన్స్ ఫర్ చేశారు. డ్యూటీకి ఆటంకం కలిగించారని ఐటీ అధికారులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ వస్తువులను బలవంతంగా లాక్కెళ్లారని కూడా ఫిర్యాదు చేశారు. దీంతో పలు సెక్షన్ల కింద మల్లారెడ్డిపై పోలీసులు కేసులు నమోదు చేశారు . తమపై దౌర్జన్యం చేశారని మంత్రి మల్లారెడ్డి కొడుకు భద్రారెడ్డి పోలీసులకు కంప్లైంట్ చేశారు. దీంతో ఐటీ అధికారి రత్నాకర్ పై 384 సెక్షన్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు

## లారీకిందపడి చనిపోయిన కోడి

**గ్రామస్థుల ఆందోళనతో ట్రాఫిక్ జామ్**

ఆసిఫాబాద్,నవంబర్24(సమ సమాజం): కొమురంభీం జిల్లా బాబాసాగర్ గ్రామంలో విచిత్ర ఘటన చోటు చేసుకుంది. కోడిని లారీ ఢీకొట్టడంతో గ్రామస్తులు ధర్నాకు దిగారు. దాంతో రోడ్డంతా ట్రాఫిక్ జామ్ అయ్యింది. రోడ్డు పొడవునా లారీలు నిలిచిపోయాయి. గ్రామస్తుల దెబ్బకు పోలీసులు రంగంలోకి దిగారు. దాంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. చింతలమానేపల్లి మండలం బాబాసాగర్ గ్రామంలో పోచమ్మవాడ ప్రధాని రహదారిని దాటుతున్న కోడిని కంకర లోడ్‌తో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. అది గమనించి ఆగ్రహానికి గురైన గ్రామస్తులు.. కోడిని ఢీకొట్టిన లారీని అడ్డగించారు. దండ్రే బండయ్యకు చెందిన కోడి రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో లారీని ఆపి స్థానికులు ఆందోళనకు దిగారు.

## ఫారెస్ట్ అధికారి అహత్య బాధాకరం

**ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇది నిదర్శనం: భట్టి**

హైదరాబాద్,నవంబర్24(సమ సమాజం): చంద్రుగొండ ఫారెస్ట్ రేంజ్ అధికారి చలమల శ్రీనివాసరావు హత్య బాధాకరమని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆవేదన వ్యక్తం చేశారు. పోడు భూముల వ్యవహారంలో ఎటూ తేల్చక పోవడం వల్లనే ఈ ఘాతుకం జరిగిందన్నారు. గిరిజనులను మోస చేయడం వల్ల ఇవాళ అధికారులు విధులు నిర్వహించలేని పరిస్థితి వచ్చిందన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పోడు భూములకు పట్టాలు ఇవ్వడంలో జాప్యం వల్లే ఘాతుకం జరిగిందని తెలిపారు. పరిష్కారం జాప్యమైతే ఎలాంటి పరిణామాలు.. ఉంటాయన్నదానికి ఇదొక ఉదాహరణ అని పేర్కొన్నారు. ఫారెస్ట్ రైట్స్ యాక్ట్ ప్రకారం మంత్రుల కమిటీ పనిచేయడం లేదని భట్టి విక్రమార్క తప్పుబట్టారు. గొత్తికోయల దాడిలో శ్రీనివాసరావు ప్రాణాలు కోల్పోయారు. ఈ కేసులో నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. హత్యకు ఉపయోగించిన రెండు వేటకొడవళ్లను వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు.

## మోదీ హయాంలో వ్యవస్థలు ధ్వంసం

**సిపిఐ నేత కూనంనేని ఘాటు విమర్శలు**



హైదరాబాద్,నవంబర్24(సమ సమాజం): దేశంలో ఆటవిక రాజ్యం కొనసాగుతున్నదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. మోదీ హయాంలో వ్యవస్థలు ధ్వంసమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాలపై ఐటీ, ఈడీలను ప్రయోగిస్తుందన్నారు. బీజేపీకి అనుకూలంగా ఉన్నవారిపై ఒక్క దాడైనా జరిగిందా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో ఇప్పటివరకు మూడు వేల ఈడీ కేసులు నమోదయ్యాయని చెప్పారు. వాటిలో ఒక్కటి కూడా నిరూపితం కాలేదని చెప్పారు. రాజకీయ కక్షతో దాడులు చేస్తున్నారని ఆరోపించారు. ప్రధాన నేరస్తుడు పీఎం మోదీయేనని చెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రగతిశీల శక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలను లొంగదీసుకునేందుకు వందల కోట్లు ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఒక అజ్ఞాని అని, ఆయన నటన ముందు ఎవరూ సరిపోరని ఎద్దేవా చేశారు. టీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఎర కేసులో బీఎల్ సంతోష్‌కు నోటీసులిస్తే ఏడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరవరరావులాంటి వారిని జైల్లో పెట్టినప్పుడు ఎందుకు స్పందించలేదన్నారు. సంతోష్ ఏమైనా దేవుడా.. నోటిసులిస్తే తప్పేంటని నిలదీశారు. సీఆర్‌పీసీ 41ఏ ప్రకారం అధికారులకు ప్రశ్నించే అధికారం ఉందని చెప్పారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కూడా విచారించాలని సిట్ అధికారులను విజ్ఞప్తి చేశారు.

## ఢిల్లీ లిక్కర్ కేసులో అభిషేక్, విజయ్‌లకు బెయిల్ నిరాకరణ

న్యూఢిల్లీ,నవంబర్24(సమ సమాజం):ఢిల్లీ లిక్కర్ కేసులో అభిషేక్ బోయినపల్లి, విజయ్ నాయర్ బెయిల్ పై స్టే ఇవ్వడానికి ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. తదుపరి విచారణను డిసెంబర్ 5కి వాయిదా వేసింది. విజయ్ నాయర్, అభిషేక్ రావుని ఢిల్లీ సీబీఐ స్పెషల్ కోర్టులో ఈడీ అధికారులు హాజరుపరిచారు . దీంతో అభిషేక్ కు 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్ విధించింది. జైల్లో బుక్స్,మెడిసిన్ ,ఉలెన్ బట్టలు, కేతిల్ ఏర్పాటు చేయాలని జైలు అధికారులను సీబీఐ స్పెషల్ కోర్ట్ ఆదేశించింది. విజయ్ నాయర్‌ని మరో వారం రోజుల కస్టడీకి ఇవ్వాలని ఈడీ అధికారులు అడిగారు. విజయ్ నాయర్ లాప్ టాప్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించా మన్నారు. డేటా రికవరీ జరుగుతుందని.. లాప్ టాప్ లో చాలా కీలకమైన డాక్యుమెంట్స్, ఆధారాలు ఉన్నాయని చెప్పారు. లిక్కర్ స్కాంలో విజయ్ నాయర్ లాప్ టాప్ రిపోర్ట్ చాలా కీలకమని తెలిపారు. 100 కోట్ల రూపాయిలు చేతులు మారాయన్నారు. ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి ల్యాప్ టాప్ రిపోర్టు రేపు రానుందని ఈడీ తరపు న్యాయవాదులు చెప్పారు. డేటా అనాలసిస్ పేరుతో తన క్లయింట్ ను ఇబ్బంది పెడుతు న్నారని విజయ్ నాయర్ తరపు న్యాయవాది వాదించారు. ఈడీ విచారణకు విజయ్ నాయర్ సహకరిస్తు న్నారని.. ఫోన్ పాస్ వర్డ్.. ల్యాప్ టాప్ పాస్ వర్డ్, ఇ-మెయిల్ పాస్ వర్డ్ అన్నీ ఈడి అధికారులకు చెప్పారన్నారు. కస్టడీలో రెండు మూడు రోజులు ఈడీ అసలు ప్రశ్నించలేదని.. ఇంకా కస్టడీ దేనికని వాదనలు వినిపించారు. ఇక శరత్ చంద్రారెడ్డికి బుక్స్, ఇంటి ఫుడ్ ఇవ్వాలని ఆయన తరపు న్యాయవాదులు సీబీఐ న్యాయస్థానికి విజ్ఞప్తి చేశారు. దీంతో పుస్తకాలను మాత్రమే ఇచ్చేందుకు సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చింది. ఇంటి భోజనం కుదరదని తేల్చి చెప్పిన న్యాయస్థానం...ఒక వేళ డాక్టర్లు సూచిస్తే మాత్రం ఆ భోజనం కూడా జైలు కిచన్ లో తయారుచేసి అందించాలని ఆదేశాలు ఇచ్చింది.



## ఆప్ బండారం బయటపడుతుంది

**అన్ని రంగాల్లో విఫలమైన ఆప్ ప్రభుత్వం**

**తీవ్ర విమర్శలు గుప్పించిన మంత్రి ధర్మేంద్ర ప్రధాన్**

న్యూఢిల్లీ,నవంబర్24(సమ సమాజం): ఢిల్లీలో ఆప్ బండారం త్వరలోనే బయటపడుతుందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. ఢిల్లీలోని కేజ్రీవాల్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. కేజ్రీవాల్ ప్రభుత్వం ఢిల్లీ ప్రజల నమ్మకాన్ని చంపేస్తోందంటూ ఆరోపించారు. మద్యం పాలసీతో కేజ్రీవాల్ ప్రభుత్వం భారీ అవినీతికి పాల్పడిందని.. దీనిని ఢిల్లీ ప్రజలు ఎప్పటికీ మరిచిపోరంటూ ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. కేజ్రీవాల్ ప్రభుత్వం విద్య సహా అన్ని రంగాలను నిర్వీర్యం చేసిందంటూ ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. కేజ్రీవాల్ ప్రభుత్వం చేస్తున్న మోసం, వంచనను త్వరలోనే బయటపడుతుందంటూ ప్రధాన్ పేర్కొన్నారు. ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాన్..ఈ వ్యాఖ్యలు చేశారు. కేజ్రీవాల్ నేతృత్వంలోని ప్రభుత్వం అవినీతికి పాల్పడుతూ.. అబద్దాలు మాట్లాడుతుందని విమర్శించారు. ఢిల్లీ ప్రజలు అధికార రాష్ట్ర ఆప్ పై ఆగ్రహంతో ఉన్నారని.. రాబోయే ఎంసీడీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ కి ఓటు వేసి గెలిపిస్తారని పేర్కొన్నారు. బీజేపీకి ఓటు వేయడానికి ప్రజలు ఉత్సాహంగా ఉన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో సామాన్యులకు అనుబంధం ఉంది. ప్రస్తుతం ఇక్కడ పాలిస్తున్న అవినీతి పార్టీపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని ప్రధాన్ అన్నారు. ఎన్నికల్లో భారీ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తంచేసిన కేంద్రమంత్రి ఇక్కడ బీజేపీ గెలుస్తుందనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదన్నారు. ౦మంత్రి సత్యేంద్ర జైన్‌కు తీహార్ జైలులో ప్రత్యేక చికిత్స, సదుపాయాలు కల్పించడంపై ప్రధాన్ విమర్శలు గుప్పించారు. సత్యేంద్ర జైన్‌కి 5-స్టార్ హోటల్‌లో ట్రీట్‌మెంట్ ఇవ్వమని డాక్టర్ వారిని అడిగారా అంటూ ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ తీరుపై ధర్మేంద్ర ప్రధాన్ ప్రశ్నించారు. అవినీతి వ్యతిరేక నేత అన్నా హజారే శిష్యులమని చెప్పుకునే ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఆప్ నేతలు ఎలా అవినీతికి పాల్పడ్డారో త్వరలోనే బట్టబయలు అవుతుందని పేర్కొన్నారు. ఇదిలావుండగా,15 ఏళ్లపాటు ఎంసీడీని చేజిక్కిం చుకుని.. తన ప్రాథమిక బాధ్యతను నిర్వర్తించడంలో విఫలమైన బీజేపీకి ఢిల్లీ ప్రజలు తగిన సమాధానం ఇస్తారని ఆప్ సీనియర్ నేత మనీష్ సిసోడియా అన్నారు. మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ లో అధికారంలో ఉంది. వరుసగా మూడు పర్యాయాలపాటు బీజేపీ అధికారంలో ఉంది. 250 వార్డుల ఎంసీడీకి డిసెంబర్ 4న ఎన్నికలు జరగనుండగా, డిసెంబర్ 7న ఓట్ల లెక్కింపు జరగనుంది.

# వ్యవస్థలను ధ్వంసం చేస్తున్న ప్రధాని మోడీ



. (మొదటి పేజి తరువాయి) నుండి ఈయాత్ర ప్రారంభమైంది. యాత్ర ప్రారంభానికి ముందు స్వాతంత్య్ర సమరయోధుడు, ప్రముఖ గిరిజనుడైన తాంతియా భీల్ జన్మస్థలాన్ని సందర్శించారు. రాహుల్ యాత్రకు కౌంటర్‌గా బిజెపి కూడా బుధవారం పాదయాత్ర చేపట్టింది. జనజాతీయ గౌరవ్ యాత్ర పేరిట శివరాజ్‌సింగ్ చౌహాన్, నలుగురు మంత్రులు రాష్ట్రంలో పర్యటించడం గమనార్హం. ఇకపోతే 78వ రోజు కొనసాగుతున్న యాత్రలో రాహుల్‌గాంధీతో కలిసి సోదరి ప్రియాంక గాంధీ వాద్రా అడుగులేస్తున్నారు. రాహుల్ భారత్ జోడో యాత్రలో గురువారం ఉదయం ప్రియాంక, ఆమె భర్త రాబర్ట్ వాద్రా పాల్గొన్నారు. రాహుల్ తో కలిసి అడుగులేస్తూ.. ప్రియాంక కార్యకర్తల్లో మరింత జోష్ పెంచారు. తమిళనాడు కన్యాకుమారిలో సెప్టెంబర్ 7న ప్రారంభమైన భారత్ జోడో యాత్ర.. కేరళ, కర్ణాటక, ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర మీదుగా కొనసాగి బుధవారం మధ్యప్రదేశ్‌లోకి అడుగుపెట్టింది. అయితే, హిమాచల్ ప్రదేశ్ ఎన్నికలు, పార్టీ వరుస కార్యక్రమాల వల్ల ప్రియాంక గాంధీ ఇంతకాలం భారత్ జోడో యాత్రలో పాల్గొనలేకపోయారు. తాజాగా.. మధ్యప్రదేశ్‌లో కొనసాగుతున్న యాత్రలో పాల్గొని ప్రియాంక కాంగ్రెస్ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపారు. ఎంపీలో గురువారం బోర్గాన్ గ్రామం నుంచి భారత్ జోడో యాత్ర ప్రారంభమైంది. ఖర్గోన్‌కు వెళ్లే ముందు స్వాతంత్య్ర సమరయోధుడు, గిరిజనుల ఐకాన్ అయిన తాంతియా భీల్ జన్మస్థలాన్ని రాహుల్, కాంగ్రెస్ నేతలు సందర్శించారు. బుర్హాన్‌పూర్‌లోని ట్రాన్స్‌పోర్ట్ నగర్‌లో జరిగిన బహిరంగ ర్యాలీలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ద్రవ్యోల్బణం, అగ్నివీర్ పథకం, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను ఎత్తిచూపుతూ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వ విధానాలను విమర్శించారు. డీమోనిటైజేషన్, జీఎస్టీ అనేది ఒక విధానం కాదని, అదొక ఆయుధమని, ఇవి చిన్న వ్యాపారులు, రైతులు, కార్మికులు, ఎంఎస్‌ఎంఈలను హరించేందుకు ఉపయోగించిన ఆయుధాలంటూ విమర్శించారు. అగ్నివీర్ పథకం ద్వారా ఉద్యోగం పొందిన వారు.. నాలుగేళ్ల సర్వీస్ తర్వాత నిరుద్యోగులు అవుతారంటూ పేర్కొన్నారు. యాత్రలో రాహుల్ వెంట వేలాదిమంది కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు

# ఇసిగా అరుణ్ గోయల్ నియామకంలో అత్యుత్సాహం

(మొదటి పేజి తరువాయి) నుంచి నవంబర్ 18 మధ్య ఏం జరిగిందో చెప్పాలంటూ.. అటార్నీ జనరల్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం నిలదీసింది. అరుణ్ గోయల్ నియామకంపై సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది. సీఈసీ నియామకానికి నలుగురి పేర్లు సిఫార్సు చేస్తే.. అరుణ్ గోయల్‌ను మాత్రమే ఎలా నియమించారు? మిగతా వారిని ఏ ప్రాతిపదికన తిరస్కరించారు? జూనియర్ స్థాయి వ్యక్తిని సీఈసీగా ఎలా ఎంపిక చేశారు? గత సీఈసీ పదవీ విరమణ వరకూ కూడా ఆగకుండా.. అరుణ్ గోయల్‌ను ఎలా ఎంపిక చేశారు? గోయల్ ఎంపికలో ఎందుకంత ఉత్సాహం చూపారు? మొత్తం ప్రక్రియను అర్థం చేసుకోవడానికే ప్రశ్నిస్తున్నాం' అని సుప్రీం పేర్కొంది. ఇలా కేంద్ర ఎన్నికల కమిషనర్ గా అరుణ్ గోయల్ ను ఆకస్మికంగా నియమించడంపై సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఒక్క రోజులోనే ఆ ప్రక్రియ ఎలా పూర్తి చేస్తారని కేంద్రాన్ని ప్రశ్నించింది. అరుణ్ గోయల్ ను ఎందుకంత వేగంగా నియమించారని కేంద్రాన్ని సుప్రీం ఘాటుగా ప్రశ్నించింది. గోయల్ నియామక ఫైళ్లను మెరుపువేగంతో ఆమోదించడంపై సుప్రీంకోర్టు పెదవి విరిచింది. 24 గంటలు కూడా గడవకముందే మొత్తం నియామక ప్రక్రియ ఎలా పూర్తి చేశారని ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఎన్నికల కమిషనర్గా అరుణ్ గోయల్‌ను ఇటీవల నియమించినందుకు సంబంధించిన ఫైళ్లను చూడాలని సుప్రీంకోర్టు బుధవారం తెలిపింది. రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుగుతున్నప్పుడు నియామకం చేయకుంటే మరింత సముచితంగా ఉండేదని కోర్టు పేర్కొంది.ఎన్నికల కమిషనర్లను నియమించేందుకు స్వతంత్ర యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలంటూ దాఖలైన పిటిషన్లపై ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. గోయల్ నవంబర్ 19న ఎన్నికల కమిషనర్‌గా నియమితులయ్యారు. రెండు రోజుల తర్వాత నవంబర్ 21న ఆయన ఈసీగా బాధ్యతలు స్వీకరించారు. ఆరు వారాల క్రితమే స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నందున ఆయన నియామకంపై పిటిషనర్లు ప్రశ్నలు లేవనెత్తారు. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ.. గోయల్‌కు స్వచ్ఛంద పదవీ విరమణ ఇస్తూ తాజా నియామకం జరిగిందని తెలిపారు. ఎన్నికల కమిషనర్‌గగా నియమితులైన ప్రతి ఒక్కరూ పదవీ విరమణ చేసిన వారేనని అన్నారు. 'గోయెల్ ప్రభుత్వంలో సిట్టింగ్ సెక్రటరీ. గురువారం ఈ కోర్టు ఈ విషయాన్ని విచారించింది. శుక్రవారం అతనికి స్వచ్ఛంద పదవీ విరమణ లభించింది. అతని అపాయింట్మెంట్ ఆర్డర్ శనివారం లేదా ఆదివారం జారీ చేయబడింది. సోమవారం అతను పని చేయడం ప్రారంభించాడు' అని భూషణ్ సుప్రీంకోర్టుకు తెలిపారు. పిటిషనర్ల వాదనలు విన్న తర్వాత గోయల్ నియామకానికి సంబంధించిన ఫైళ్లను గురువారం తీసుకురావాలని అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణిని సుప్రీంకోర్టు కోరింది. 'మేము ఈ కేసును విచారించడం ప్రారంభించిన తర్వాత ఈ నియామకం జరిగింది కాబట్టి...' అని న్యాయస్థానం లీగల్ సైట్ లైవ్ లా పేర్కొంది. యాంత్రిక విధానాన్ని అర్థం చేసుకోవాలని..ప్రతిదీ చూడాలని కోర్టు పేర్కొంది. అయితే వెంకటరమణ ఆదేశాలపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈసీల నియామకానికి సంబంధించిన పెద్ద సమస్యపై కోర్టు వ్యవహరిస్తోందని వ్యక్తిగత కేసును చూడలేమని చెప్పారు. . దీనిపై గత గురువారం విచారణ ప్రారంభించామని నవంబర్ 19న గోయెల్ అపాయింట్మెంట్ జరిగిందని సుప్రీంకోర్టు పేర్కొంది.కాబట్టి తాజా నియామకానికి కారణమేమిటో చూడాలని కోర్టు పేర్కొంది. ఇకపోతే గోయల్ 1985 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. అతను ఒక నెల క్రితం వీఆర్ఎస్ తీసుకున్నాడు నవంబర్ 19న ఈసీగా నియమితుడయ్యాడు. అతను 37 సంవత్సరాల కంటే ఎక్కువరోజులు ఐఏఎస్ గా కొనసాగారు. భారత ప్రభుత్వ భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా పదవీ విరమణ పొందాడు. 7 డిసెంబర్ 1962న జన్మించిన అతను కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలోని చర్చిల్ కాలేజీ నుండి డెవలప్మెంట్ ఎకనామిక్స్లో పోస్ట్-గ్రాడ్యుయేట్ డిగ్రీని పొందాడు. అతను అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలోని జాన్ ఎఫ్ కెన్నెడీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్లో కూడా శిక్షణ పొందాడు. భారీ పరిశ్రమల కార్యదర్శిగా అతను భారతదేశంలో ఇ-వాహన ఉద్యమాన్ని చైతన్యపరిచాడు. గోయెల్ లుధియానా జిల్లా (1995-2000), భటిండా జిల్లా (1993-94) జిల్లా ఎన్నికల అధికారిగా పనిచేశాడు అక్కడ అతను వివిధ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను సజావుగా నిర్వహించారు. పంజాబ్‌లో ప్రిన్సిపల్ సెక్రటరీగా అతను న్యూ చండీగఢ్ అన్ని ఇతర ప్రధాన పట్టణాల మాస్టర్ ప్లాన్లను నడిపించాడని కమిషన్ తెలిపింది.

# గ్రూపు పరీక్షలో మరికొన్ని పోస్టులు

(మొదటి పేజి తరువాయి) మేరకు గతంలో జారీ చేసిన 55 జీవోలో సవరణలు చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. తాజా నిర్ణయంతో గ్రూప్-2, 3, 4లో పోస్టులు మరిన్ని పెరిగే అవకాశం ఉన్నది. గ్రూప్-2లో చేర్చిన పోస్టులు ఇలావున్నాయి. అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిష్ సర్వీస్),అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఇతర శాఖలకు సంబంధించి),జువైనల్ డిస్ట్రిక్ట్ ప్రొబేషన్ ఆఫీసర్ సిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్, అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులు చేరాయి. గ్రూప్-3లో..గిరిజ సంక్షేమ శాఖ అకౌంటెంట్, సీనియర్ అసిస్టెంట్/అకౌంటెంట్, జూనియర్ అసిస్టెంట్/అకౌంటెంట్ లేదా హె ఇదే విధమైన పోస్టులు ఉంటాయి. గ్రూప్-4లో.. జిల్లా కార్యాలయాల్లో జూనియర్ అసిస్టెంట్, జూనియర్ అకౌంటెంట్, జువైనల్ సర్వీసెస్ సూపర్‌వైజర్ (మేల్) (జువైనల్ సర్వీసెస్, డబ్ల్యూసీడీ అండ్ ఎస్సీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్),మ్యాట్రన్ కమ్ స్టోర్ కీపర్,మ్యాట్రన్ (కమిషన్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్) పోస్టులు చేరాయి.

# ఐటి దాడులు జరుగుతన్న తీరు దారుణం



(మొదటి పేజి తరువాయి) ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదన్నారు. అలాగే బీజేపీ కుట్రలకు భయపడేది లేదని తేల్చి చెప్పారు. ఐటీ, ఈడీ దాడులకు భయపడొద్దని సీఎం కేసీఆర్ ముందే చెప్పారని అన్నారు. ఇలాంటి దాడులతో తమనే కాదు సీఎం కేసీఆర్‌నూ ఏం చేయలేరని అన్నారు. టీఆర్ఎస్ ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేల మీద ఇంత కుట్ర అవసరమా అని ఆయన ప్రశ్నించారు. తనను మానసికంగా కుంగదీయడానికే సోదాలు నిర్వహించారని మల్లారెడ్డి ఆక్షేపించారు. ఇలాంటి దౌర్జన్యాలు తానెప్పుడూ చూడలేదన్నారు. తాము చేసేది వ్యాపారం కాదని.., విద్యారంగంలో సేవ చేస్తున్నట్లు తెలిపారు. 30 ఏళ్ల నుంచి ఇక్కడే ఉంటున్నానని.., ఇంజినీరింగ్ వ్యవస్థను తీసుకొచ్చింది తానే అని గర్వంగా చెబుతానని అన్నారు. విద్యారంగంలో ఇంజినీరింగ్ వ్యవస్థ అంటే మల్లారెడ్డి గుర్తొచ్చేలా తీర్చిదిద్దామన్నారు. వచ్చేది బిఆర్ఎస్ అని, తమదే ప్రభుత్వమని గుర్తించాలని హెచ్చరించాలరు. తానేమీ దందాలు చేయలేదని, 'పాలు అమ్మి, బోర్లు వేసి పైకి వచ్చా. ఇంజినీరింగ్ వ్యవస్థను తీసుకొచ్చింది నేనే అని గర్వంగా చెబుతున్నా. మేం చేసేది వ్యాపారం కాదు సేవ. తన కొడుకు చదవాలన్నా సీటు ఇప్పించుకోలేని పరిస్థితి నాది. ఇప్పుడున్నదంతా ఆన్‌లైన్. మేనేజ్‌మెంట్ కోటా, డొనేషన్లు లేవు. కేంద్ర బలగాలతో మాపై పెద్ద ఎత్తున దాడులు చేశారు. నాకు ఐటీ దాడులపై ఎక్స్‌పీరియన్స్ ఉంది. గతంలో రెండు సార్లు దాడులు జరిగాయి. ఇది మూడో సారి. కానీ ఈ విధంగా దాడులు జరగడం నేను ఎప్పుడూ చూడలేదు. మేం దొంగలమా, డాన్‌లమా ?. తప్పులు చూపిస్తే ఫైన్ కడతాం అని చెప్పినం కదా. నా కొడుకు ఆస్పత్రిలో ఉన్నా అధికారులు కనికరం చూపలేదు. నా పెద్దకొడుకును మానసికంగా వేధించి సంతకం పెట్టించారు. 100 కోట్ల బ్లాక్ మనీ ఉన్నట్లు రాసి సంతాకలు పెట్టిచ్చుకున్నరు. అధికారులే ఇలా మోసం చేస్తారని అనుకోలేదు.' అని మల్లారెడ్డి వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఎవ్వరిని వదలబోమని హెచ్చరించారు. ఐటీ రైడ్స్ చేసినంతా మాత్రాన తాను పార్టీ మారబోనని అన్నారు. 'నేనెందుకు పార్టీ మారుతా. బ్రహ్మాండంగా మా సీఎం కేసీఆర్ ఉన్నరు. ఆయన మాకు చెప్పిండు. మల్లారెడ్డి దేనికి భయపడొద్దని. ఇంకా చాలా మంది మంత్రులు, ఎమ్మెల్యేలపై దాడులు ఉంటయ్. మేము అన్నింటికీ తయారుగా ఉన్నాం. దేనికైనా మేం సిద్ధం. నెక్స్ట్ బీఆర్ఎస్.. ఏదీ వదలం, ఎవ్వరిని ఇడువం. వచ్చేది మా ప్రభుత్వమే. ఎన్ని అరాచకాలు చేస్తరో చేసుకోండ్రి.' అని మల్లారెడ్డి అన్నారు.

## మూడరోజు కొనసాగిన ఐటి దాడులు

(మొదటి పేజి తరువాయి) ఇంట్లో సోదాలు ముగిశాయి. మెడికల్, డెంటల్ కళాశాలలు, మల్లారెడ్డి వర్సిటీలోనూ సోదాలు చేశారు. అంతకు ముందు.. తమ ఇంట్లో సోదాలు ముగిసిన తర్వాత పంచనామా నివేదికలను మంత్రి మల్లారెడ్డికి ఐటీ అధికారులు అందజేశారు. ఈనెల 28వ తేదీసోమవారం ఐటీ ఎదుట హాజరు కావాలంటూ నోటీసుల్లో పేర్కొన్నారు. మరోవైపు మల్లారెడ్డి అల్లుడు రాజశేఖర్ ఇంట్లో సోదాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ తనిఖీల్లో 10 కోట్ల 50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. అర్ధరాత్రి సమయంలో మంత్రి మల్లారెడ్డి.. గన్ మెన్, సెక్యూరిటీ లేకుండా కేవలం డ్రైవర్ తో హాస్పిటల్ కి వెళ్లారు. తప్పుడు పత్రాలపై ఐటీశాఖ అధికారులు బలవంతంగా సంతకాలు తీసుకున్నారని ఆరోపించారు. మరోవైపు ఇదే విషయంపై బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసేందుకు మంత్రి మల్లారెడ్డితో పాటు ఆయన చిన్న కుమారుడు వెళ్లారు. ఎన్ని కోట్లు రాశారని మంత్రి మల్లారెడ్డి ప్రశ్నించడంతో రూ.100 కోట్లు అని ఐటీ అధికారి రత్నాకర్ సమాధానమిచ్చారని తెలుస్తోంది. ఇదే విషయంపై మంత్రి మల్లారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. మీడియా ద్వారా ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లండి అని అన్నారు. ఐటీ అధికారులు, సిబ్బంది తమపై దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. హాస్పిటల్ చికిత్స పొందుతున్న తమ పెద్ద కుమారుడుతో బలవంతంగా సంతకం చేయించుకున్నారని చెప్పారు. దీనిపై మళ్లీ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. గతంలోనూ మూడుసార్లు ఐటీ అధికారుల సోదాలు జరిగాయి కానీ, ఇంత దౌర్జన్యం ఎప్పుడూ చూడలేదన్నారు. 'మా ఇండ్లు, బంధువుల ఇండ్లల్లో సోదాలు చేస్తున్న సమయంలో ఐటీ అధికారులు చాలా రకాల ఇబ్బందులు పెడుతున్నారు. మా వాళ్లను ఇష్టం వచ్చినట్లు కొడుతున్నారు. వాళ్లు ఐటీ అధికారులు కాదు.. రక్త పిశాచులు. ఉన్నవి లేనట్టుగా, లేనివి ఉన్నట్టుగా రాస్తున్నారు. చిత్ర హింసలకు గురి చేస్తున్నారు' అంటూ మంత్రి మల్లారెడ్డి ఆరోపించారు. ఐటీశాఖ అధికారులు గందరగోళంగా సోదాలు చేశారని మంత్రి మల్లారెడ్డి ఆరోపించారు. తమ వద్ద ఎటువంటి డబ్బు దొరకలేదన్నారు. తమ మెడికల్ కాలేజీకి సంబంధించి అన్ని అబద్దాలు రాశారని చెప్పారు. సోదాల్లో సీజ్ చేసిన ల్యాప్ టాప్ లను ఐటీ అధికారుల నుండి మంత్రి మల్లారెడ్డి అనుచరులు బలవంతంగా లాక్కున్నారు. దీంతో బోయిన్ పల్లి పీఎస్ వద్ద హైడ్రామా నడిచింది. తాను లేని సమయంలో తమ కుమారుడితో బలవంతంగా తప్పుడు స్టేట్ మెంట్ ఇప్పించి సంతకం చేయించుకున్నారని మంత్రి మల్లారెడ్డి బోయిన్ పల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. శంషాబాద్ మండలం కాచారం గ్రామ పరిధిలోని వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐటీ అధికారులు సోదాలు చేశారు. మూడు కార్లల్లో వెళ్లిన ఐటీ అధికారులు, సిబ్బంది తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. కళాశాల యాజమాన్యం గేటులోకి విద్యార్థులను తప్ప ఇతరులను రానీయలేదని తెలుస్తోంది. ఐటీ అధికారులు, సిబ్బందికి ఆర్మీ జవాన్లు బందోబస్తుగా వెళ్లారని చెబుతున్నారు. వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో మర్రి రాజశేఖర్ రెడ్డి డైరెక్టర్ గా ఉన్నారు. మర్రి రాజశేఖర్ రెడ్డి.. టర్కీ నుండి హైదరాబాద్ కు చేరుకున్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకున్న రాజశేఖర్ రెడ్డి.. నేరుగా తమ నివాసానికి వెళ్లారు. ఎయిర్ పోర్టులో మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పలేదు. ఐటీ రైడ్స్ గురించి తనకు తెలియదని, తాను మీడియా ద్వారానే చూసి తెలుసుకున్నానని, ఇంటికి వెళ్లాక పూర్తి వివరాలు తెలియజేస్తానని చెప్పారు.

# అటవీ అధికారి హత్యకు బాధ్యత ప్రభుత్వానిదే

(మొదటి పేజి తరువాయి) అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లిక్కర్ స్కామ్ లో కేసీఆర్ కుటుంబ పాత్రపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోందన్నారు. తప్పు చేయకపోతే.. విచారణ అధికారులకు పూర్తిగా సహకరించాలని డిమాండ్ చేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి కొంత మంది గుత్తికోయలు వలస వచ్చారు. వీరు కొత్తగూడెం జిల్లా చంద్రగొండ మండలం బెండాలపాడు పంచాయతీ ఎర్రబోడులో అవాసం ఏర్పాటు చేసుకున్నారు. పోడు వ్యవసాయం ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. పోడు భూముల సర్వే కోసం బెండాలపాడు పంచాయతీ కొన్ని రోజుల కిందట తీర్మానం చేసింది. ఈ నేపథ్యంలో ఎర్రబోడులో కొంత మంది గిరిజనులు ప్లాంటేషన్ మొక్కలను ధ్వంసం చేసి పోడుకు సిద్ధమైనట్లు నవంబర్ 22వ తేదీ ఉదయం అటవీశాఖ అధికారులకు సమాచారం అందింది. ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాసరావు, ఇద్దరు సిబ్బందిని వెంటబెట్టుకొని ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్లాంటేషన్ మొక్కలను నరికేస్తున్న వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో గుత్తికోయలకు, ఫారెస్ట్ సిబ్బందికి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఆఫీసర్ శ్రీనివాసరావుపై కొంత మంది గిరిజనులు వేటకొడవళ్లు, గొడ్డళ్లతో ఒక్కసారిగా దాడి చేశారు. వేటకొడవళ్లతో విచక్షణారహితంగా నరకడంతో శ్రీనివాసరావు రక్తపు మడుగులో కుప్పకూలిపోయారు. తీవ్రంగా గాయపడిన ఆయణ్ని సహచర సిబ్బంది వెంటనే ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ముందస్తు ప్రణాళికతోనే శ్రీనివాసరావుపై దాడి చేశారని బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ దాడి ఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఘటనపై అటవీ శాఖ ఉన్నతాధికారులు అరా తీశారు. పోలీసులు విచారణ చేపట్టారు.

# సిఎం కెసిఆర్ మానస పుత్రిక డబుల్ ఇళ్ల పథకం

(మొదటి పేజి తరువాయి) పురోగతి, లబ్దిదారుల ఎంపికపై అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి ప్రశాంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్, హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి సునీల్ శర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు. పూర్తయిన ఇండ్లకు లబ్దిదారుల ఎంపిక వేగంగా, పారదర్శకంగా జరగాలని అధికారులకు మంత్రి వేముల సూచించారు. అర్హులకు మాత్రమే రెండు పడక గదుల ఇండ్లు అందేలా చూడాలన్నారు. నిర్మాణం తుదిదశలో ఉన్న ఇండ్లు వెంటనే పూర్తిచేయాలని సూచించారు. కాగా, డబుల్ బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణ ప్రగతి, లబ్దిదారుల ఎంపిక తదితర అంశాలపై మంత్రి వేముల బుధవారం కూడా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 2,91,057 ఇండ్లను మంజూరు చేయగా, అందులో 1,29,528 ఇండ్ల నిర్మాణం పూర్తయిందని మంత్రి వెల్లడించారు. మరో 58,350 ఇండ్ల నిర్మాణం తుదిదశకు చేరుకోగా, మిగిలిన 40,651 ఇండ్ల నిర్మాణం పనులు వివిధ దశలో ఉన్నాయని వివరించారు. పేదల డబుల్ బెడ్రూమ్ ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ఇప్పటివరకు రూ.11,614.95 కోట్లు ఖర్చు చేసిందని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో పేదల కోసం రూ.19,328.32 కోట్ల ప్రతిపాదిత వ్యయంతో 2,91,057 డబుల్ బెడ్రూమ్ ఇండ్లను మంజూరు చేసినట్టు, ఇందులో 2,28,529 ఇండ్ల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



ముంబై,నవంబర్24(సమ సమాజం): గత రెండు రోజులుగా తగ్గుతూ వస్తున్న బంగారం ధర గురువారం కూడా తగ్గింది. మొత్తంగా గత మూడు రోజుల్లో బంగారం ధర తులంపై దాదాపు రూ.400 వరకూ తగ్గింది. ఇదొక పెద్ద తగ్గుదలలా భావించకున్నా కూడా గత నాలుగు రోజులుగా బంగారం పెరిగిందైతే లేదు. స్థిరంగా ఉండటమో లేదంటే స్వల్పంగా తగ్గడమో జరుగుతూ వస్తోంది. నేడు దేశంలో 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు)పై రూ.100 తగ్గింది. దీంతో నేడు తులం బంగారం ధర (22 క్యారెట్లు) రూ.48,250కి చేరుకుంది. ఇక 24 క్యారెట్ల బంగారం ధరపై రూ.110 వరకూ తగ్గింది. దీంతో 24 క్యారెట్ల బంగారం ధర రూ.52,640కి చేరుకుంది. ఇక వెండి ధర కూడా అత్యంత స్వల్పంగా తగ్గింది. దేశీయంగా కిలో వెండి రూ.200 మేర తగ్గి.. రూ.61,000 లుగా కొనసాగుతోంది.

# ఈడబ్ల్యూఎస్ కోటాలో ఎస్సీ, ఎస్టీలకు చోటు

(మొదటి పేజి తరువాయి) అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలన్నారు. తమిళనాడు, జార్ఖండ్‌లా తెలంగాణలో కూడా రిజర్వేషన్లు పెంచాలని ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.బీసీ రిజర్వేషన్ల అంశంపై నవంబర్ 26 నుండి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. కోటి సంతకాల సేకరణ చేసి రాష్ట్రపతికి పంపుతామన్న ఆయన... గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. దేశంలో బీసీ జనాభా 52 శాతం అయితే 27శాతం రిజర్వేషన్ ఎలా సరిపో తుందని ప్రశ్నించారు. అగ్రవర్ణాల పేదలు 8శాతం ఉంటే 10శాతం రిజర్వేషన్లను ఇచ్చారన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం బీఎస్పీ పోరాడితే బీజేపీ అప్పట్లో అడ్డుకుందని ఆరోపించారు. బీసీలకు 50శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం బీసీ జనగణన చేయాలని కోరారు. పెరిగిన జనాభాకి అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. తమిళనాడు, జార్ఖండ్ లాగా తెలంగాణలో కూడా రిజర్వేషన్లు పెంచాలన్నారు. ఉన్నత న్యాయస్థానాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఖచ్చితంగా కోటా అమలుచేయాలని కోరారు. బీసీ క్రిమిలేయర్ విధానం ఎత్తివేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే అంతా బోగస్ అన్న ఆయన.. సమగ్ర సర్వే ను సీఎం కేసీఆర్ బయట పెట్టాలన్నారు. టీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరు నెలల్లో ముందస్తు ఎన్నికలకు వెళ్తారని ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈడీ ,ఐటీసోదాలు.. టీఆర్ఎస్ , బీజేపీ ఆడుతున్న డ్రామాలన్నారు. ఎఫ్ఆర్వో అధికారి హత్యకి సీఎం కేసీఆర్ నైతిక బాధ్యత వహించాలన్నారు.

# రాష్ట్రంలో మళ్లీ మొదటికి వచ్చిన వీఆర్ఏల సమస్య

(మొదటి పేజి తరువాయి) సమ్మె చేశారు. మునుగోడు ఉప ఎన్నిక రావడంతో ప్రభుత్వం దిగి వచ్చి వీఆర్ఏలను చర్చలకు ఆహ్వానించింది. మంత్రి కేటీఆర్, చీఫ్ సెక్రటరీ సోమేష్ కుమార్ రెండు దఫాలుగా వరుసగా వారితో చర్చలు జరిపారు. మునుగోడు ఉపఎన్నిక ముగియగానే వీఆర్ఏల సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వీఆర్ఏలు సమ్మె విరమణ చేశారు. కానీ మునుగోడు ఉప ఎన్నిక ముగిసి రోజులు గడుస్తున్నా.. ఇప్పటి వరకు వీఆర్ఏల సమస్యలు పరిష్కారం కాలేదు. తమ డిమాండ్ల పరిస్థితి ఏమిటి..? తమ సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారు.. అని నేతల చుట్టూ తిరుగుతున్నా.. అపాయింట్ మెంట్ అడిగినా ఇవ్వడం లేదని వీఆర్ఏలు వాపోతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 23వేల మందికిపైగా వీఆర్ఏలు ఉన్నారు. పే స్కేల్ అమలు, అర్హులైన వారికి పదోన్నతులు, 55 సంవత్సరాలు పైబడిన వీఆర్ఏల కు సర్వీస్ పెన్షన్ సదుపాయం, వారసులకు ఉద్యోగాల నియామకం కల్పించాలని వీఆర్ఏలు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 23వేల మంది గ్రామ రెవెన్యూ సహాయకులు కారుణ్య నియామకం ద్వారా 20వేల మంది, ఏపీపీఎస్సీ డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా 3వేల మంది అందులో సుమారు 60శాతం మహిళలు నియామకం అయ్యారు. ప్రభుత్వానికి సంబంధించిన సుమారు 36 రకాల విభాగ అధికారులు గ్రామానికి వచ్చినప్పుడు వారికి క్షేత్రస్థాయిలో సహాయ సహకారాలు అందించి వారికి అండగా ఉంటారు. కానీ వీఆర్ఏలు సమ్మె చేయడంతో చాలా వరకు గ్రామాలలో జనాలు ఇబ్బంది పడుతున్నారు. వీఆర్ఏలకు సర్వీస్ పరంగా పదవ తరగతి ఉత్తీర్ణతతో అటెండర్, నైట్ వాచ్మెన్, జీప్ డ్రైవరు పదోన్నతి సదుపాయాలు ఉన్నాయి.. కానీ కొత్త జిల్లాలు కొత్త డివిజన్ల ఏర్పాటు జరగడం వల్ల డివిజన్ పరిధి విషయంలో పాత జిల్లా డివిజన్ ని పరిగణలోకి తీసుకోవాలో లేక కొత్త డివిజన్ పరిధి లోకి తీసుకోవాలో తెలవక పదోన్నతి ప్రక్రియ చేపట్టడం లేదు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతతో ఐదు సంవత్సరాల సర్వీస్ పూర్తయిన వారికి వీఆర్వోగా పదోన్నతి కల్పించాలి. కానీ కొత్త రెవెన్యూ చట్టంతో వీఆర్వో వ్యవస్థ రద్దయి పదోన్నతి అవకాశం కోల్పోయారు. దీంతో వీఆర్ఏలకు పే స్కేలు లేదు, పిఎఫ్ లేదు, మెటర్నిటీ సెలవులు లేవు, ఈఎస్ఐ లేదు, హెల్త్ కార్డ్స్ లేవు, పెన్షన్ లేవు, ఉద్యోగ భద్రత లేదు, సమయ పాలన లేదు, పదోన్నతులు లేవు. మునుగోడు ఉప ఎన్నిక తర్వాత అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్న ప్రభుత్వం ఎన్నికలు ముగిసి రోజులు.. వారాలు గడుస్తున్నా పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. దీంతో వీఆర్ఏల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ముందుకు వచ్చి తమ సమస్యలు పరిష్కారం చేయాలని వీఆర్ఏలు డిమాండ్ చేస్తున్నారు.

## నేడు బిజెపిలో చేరనున్న మర్రి శశిధర్ రెడ్డి


(మొదటి పేజి తరువాయి) చేరికలపై కూడా ఈ సందర్భంగా చర్చించే అవకాశం ఉంది. 28 నుంచి ప్రారంభం కానున్న బండి సంజయ్ ఐదో విడత పాదయాత్రకు జాతీయ నేతలను ఆహ్వానించే విషయంపై కూడా హైకమాండ్ తో చర్చించనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# డిజెంబర్‌లో వారం పాటు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు

(మొదటి పేజి తరువాయి) చర్చించాలని నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆంక్షల వల్ల రాష్ట్రం.. రూ.40 వేల కోట్ల ఆదాయం కోల్పోయిందని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. ఇదే అంశంపై అసెంబ్లీ సమావేశాల్లో కేంద్రాన్ని ఎండగట్టాలని నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ఈడీ, ఐటీ దాడులను సమావేశాల్లో కేసీఆర్ ఎండగట్టే అవకాశం ఉంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం తమ అధీనంలోని దర్యాప్తు సంస్థలతో రాష్ట్రంలో వరుస దాడులతో బెంబేలెత్తిస్తుండడంతో.. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రంపై ఎదురుదాడికి సిద్ధమవుతోంది. ఇందుకోసం రాష్ట్రంలో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ సంస్థల ఉద్యోగులను లక్ష్యంగా చేసుకోనుంది. రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో పనిచేసే అవినీతి నిరోధక బృందాన్ని (ఏసీబీని) ఇందుకు అస్త్రంగా వాడుకోనుంది. రాష్ట్రంలోని కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నారన్న సమాచారం అందినా, ఎవరి నుంచైనా లంచం డిమాండ్ చేసినట్లుగానీ, లంచం తీసుకున్నట్లుగానీ ఫిర్యాదులు అందినా.. ఆ ఉద్యోగులపై అవినీతి నిరోధక చట్టం కింద నేరుగా కేసులు నమోదు చేసి విచారణ చేపట్టనుంది. అవినీతి నిరోధక చట్టం ప్రకారం రాష్ట్ర ఏసీబీకి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై కేసులు పెట్టేందుకు అవకాశం ఉండటంతో.. దాని ఆధారంగా ఎదురుదాడికి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. మొత్తంగా కేంద్రం పక్షపాత ధోరణిపై కెసిఆర్ ఆగ్రహంగా ఉన్నారు. అనేకాక అంశాల్లో అన్యాయం జరగుతున్నా పట్టించుకోవడం లేదు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజలకు సవివరంగా తెలియజేసేందుకు డిసెంబర్ నెలలో వారం రోజుల పాటు శాసనసభ సమావేశాలు నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్ రావును, శాసన సభ వ్యవహారాల మంత్రి ప్రశాంత్ రెడ్డిని సీఎం ఆదేశించారు.




# చలన చిత్రం



## చిరు తరహాలో మళయాలం రీమేక్‌పై నాగ్

మెగాస్టార్ చిరంజీవి బాటలోనే హీరో కింగ్ నాగార్జున కూడా మలయాళ రీమేక్ పై కన్నేసాడు. ఇటీవల స్ట్రెయిట్ స్టోరీస్ తో నాగ్ చేసిన 'వైల్డ్ డాగ్ ' 'ది ఘోస్ట్' సినిమాలు భారీ అంచనాల మధ్య విడుదలై తీవ్ర నిరాశకు గురి చేశాయి. దీంతో నాగ్ రీమేక్ సినిమా అయితే బెటర్ అని ఓ మలయాళ సినిమాపై కన్నేశాడని తెలిసింది. 'పోరింజు మరిమమ్ జోస్'. జోజు జార్జ్ ప్రధాన పాత్రలో జోషీ రూపొందించిన ఈ మూవీ ఇది. తెలుగులో కృష్ణంరాజుతో 'అంతిమ తీర్పు' వంటి సంచలన చిత్రాన్ని తెరకెక్కించిన జోషీ ఈ మూవీని రూపొందించారు. 2019లో విడుదలైన ఈ సినిమా అక్కడ సంచలన విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ మూవీని చూసిన నాగార్జున ఇంప్రెస్ అయ్యారట. దీన్ని తెలుగులో రీమేక్ చేయాలని ఫిక్సయ్యారని వార్తలు వినిపిస్తున్నాయి. త్రినాథరావు నక్కిన రూపొందించిన పలు సినిమాలకు రైటర్ గా వ్యవహరిస్తూ వస్తున్న ప్రసన్న కుమార్ బెజవాడ ఈ రీమేక్ తో దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు. ఈ రీమేక్ మూవీని శ్రీనివాస సిల్వర్ స్క్రీన్స్ బ్యానర్ పై నిర్మాత శ్రీనివాస చిట్టూరి నిర్మించనున్నారట. ఇటీవల రామ్ తో 'ది వారియర్' నిర్మించి ప్రస్తుతం నాగచైతన్య తో 'కస్టడీ' మూవీలని అందిస్తున్న శ్రీనివాస చిట్టూరి ఈ రీమేక్ ని నిర్మించనున్నారని తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ కి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారని తెలిసింది.

## పాన్ ఇండియా లెవల్లో హిట్-2 విడుదల




అడివి శేష్, మీనాక్షి చౌదరి జంటగా శైలేష్ కొలను రూపొందిస్తున్న చిత్రం 'హిట్2'. నాని సమర్పణలో ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్నారు. ఈ మూవీ ట్రైలర్‌ను బుధవారం లాంచ్ చేశారు. ఈ సందర్భంగా అడివి శేష్ మాట్లాడుతూ 'ట్రైలర్‌తోనే సినిమా ఎలా ఉంటుందనేది చూపించాం. ఇది ప్రేక్షకులందరికీ బిగ్గెస్ట్ సెలెబ్రేషన్. ఈ సినిమాని ప్యాన్ ఇండియా లెవెల్‌లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం. నాని నాకు సక్సెస్‌ఫుల్ సినిమా ఇస్తున్నందుకు హ్యాపీ. ఎప్పుడూ ఫైట్స్ చేసే నేను..ఇందులో డ్యాన్స్ కూడా చేశా. 'హిట్' అనేది శైలేష్ విజన్. ఈ యూనివర్స్‌లో పార్ట్2 ఇంపార్టెంట్ భాగం. అలాగే 'హిట్3'లో నేనూ ఉన్నందుకు హ్యాపీ'అన్నాడు. తన కెరీర్‌లోనే ఇది స్పెషల్ ఫిల్మ్ అంది మీనాక్షి. 'ట్రైలర్‌తో సినిమా మూడ్ చూపించాం, డిసెంబర్ 2న రాబోతున్న సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది'అన్నాడు శైలేష్. నటులు శ్రీనాథ్ మాగంటి, పావని పాల్గొన్నారు

## వీరసింహారెడ్డి నుంచి నేడు పాట విడుదల





బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'వీరసింహారెడ్డి'. శ్రుతిహాసన్ హీరోయిన్. సంక్రాంతికి రిలీజ్ అని ఇప్పటికే అనౌన్స్ చేసిన టీమ్, ప్రమోషన్స్ లో స్పీడు పెంచుతూ ఫస్ట్ సాంగ్ రిలీజ్ డేట్‌ను బుధవారం అనౌన్స్ చేసింది. 'గాడ్ ఆఫ్ మాసెస్ కోసం మాస్ ఆంథమ్' రాబోతోంది అంటూ 'జై బాలయ్య' పాటను నవంబర్ 25న విడుదల చేయబోతున్నట్టు చెప్పారు. 'రాజసం ఇంటిపేరు' అంటూ విడుదల చేసిన పోస్టర్‌లో.. వైట్ అండ్ వైట్ కాస్ట్యూమ్స్‌లో ట్రాక్టర్ నడుపుతూ రాయల్ లుక్‌లో కనిపించారు బాలకృష్ణ. 'అఖండ'లో జై బాలయ్య అనే పాటను కంపోజ్ చేసిన తమన్.. 'వీరసింహారెడ్డి' కోసం ఇదే పల్లవితో మరో మాస్ నంబర్‌ను రెడీ చేశాడు. అభిమానులు ఫుల్ ఖుషీ అయ్యేలా ఈ పాట ఉంటుందంటున్నారు మేకర్స్. ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో ÷-లకైమాక్స్ షూటింగ్ జరుగుతోంది. ఈషెడ్యూల్‌తో టాకీ పార్ట్ పూర్తవనుండగా త్వరలోనే ఓ పాటను విదేశాల్లో తీయనున్నారు. దునియా విజయ్, వరలక్ష్మీ శరత్‌కుమార్ ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. చంద్రిక రవి స్పెషల్ సాంగ్ చేస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్నారు.

## ఫ్రిబవరి 17న రానున్న విశ్వక్‌సేన్ ధమ్‌కీ

టాలీవుడ్ హీరో విశ్వక్‌సేన్ నటిస్తున్న తాజా చిత్రం ధమ్‌కీ. విశ్వక్ సేన్ స్వీయ దర్శకత్వం వహిస్తూ.. హీరోగా నటిస్తున్నాడు. ధమ్‌కీ ఫిబ్రవరి 2023న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతుందని మేకర్స్ ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. తాజాగా విశ్వక్ సేన్ టీం విడుదల తేదీ కూడా ప్రకటించేసింది. ఫిబ్రవరి 17న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించింది. భమ్ భోలేనాథ్ శివరాత్రి 2023కి మీ ముందుకు




వస్తున్నాడు..అంటూ జీన్స్, సూట్‌లో చేతిలో కర్రపట్టుకున్న పోస్టర్‌ను షేర్ చేస్తూ విడుదల తేదీ అప్‌డేట్ అందించాడు విశ్వక్‌సేన్. పాన్ ఇండియా కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నివేదా పేతురాజ్ హీరోయిన్‌గా నటిస్తోంది. రావు రమేశ్, పృథ్విరాజ్, హైపర్ ఆది కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నాడు. వన్మయి క్రియేషన్స్, విశ్వక్ సేన్ సినిమాస్ బ్యానర్లు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. కామెడీ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీకి ప్రసన్నకుమార్ బెజవాడ కథనందిస్తున్నాడు.



## న్యూజిలాండ్ షూటింగ్‌లో ఆర్‌సి 15

స్టార్ హీరో రాంచరణ్ ప్రస్తుతం శంకర్ డైరెక్షన్‌లో నటిస్తున్న చిత్రం ఆర్‌సీ 15 న్యూజిలాండ్ షెడ్యూల్ జరుపుకుంటోంది. పొలిటికల్ థ్రిల్లర్ జోనర్‌లో వస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. కాగా రాంచరణ్ హెయిర్‌స్టైలిష్ట్ ఆలీమ్ హకీంతో సరదాగా చిట్‌చాట్ చేస్తున్న స్టిల్‌ను నెట్టింట షేర్ చేశాడు. సినిమాలో వచ్చే డ్యుయెట్ సాంగ్ గురించి ఈ ఇద్దరి మధ్య డిస్కషన్స్ జరిగినట్టు అప్‌డేట్‌తో క్లారిటీ ఇచ్చాడు చరణ్. బోస్కో మార్టిన్ ఈ పాటను కంపోజ్ చేస్తున్నాడు. వారంపాటు సాగే షెడ్యూల్‌లో ఈ పాటను షూట్ చేయనున్నారు. షూట్ అయిన తర్వాత డిసెంబర్ మొదటి వారంలో రాంచరణ్ తిరిగి హైదరాబాద్‌కు రానున్నట్టు ఫిలింనగర్ సర్కిల్ టాక్. ఆర్‌సీ 15 చిత్రానికి ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రంలో బాలీవుడ్ భామ కియారా అద్వానీ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. అంజలి, శ్రీకాంత్, సముద్రఖని, నవీన్ చంద్ర, సునీల్, జయరాయ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. దిల్ రాజు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై అత్యంత భారీ బ్జడెట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి కార్తీక్ సుబ్బరాజు కథనందిస్తుండగా..సాయిమాధవ్ బుర్రా సంభాషణలు రాస్తున్నారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA, Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**, RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in